# కరణం ఓ వశీకరణం

మంచం మీద లేచి కూర్చుని సిగరెట్ తీసి వెలిగించాడు సత్తిబాబు. ఆరిపోయిన అగ్గిపుల్లను కిటికీలోంచి బయటకు విసిరాడు. గదిలోని గాలి బిగుసుకుపోయినట్లుగా ఉంది. దుప్పటి తొలగించి ముందుకు వంగి బల్ల సొరుగులోంచి చేతి గడియారం అందుకుని కిటికీలోంచి పడుతున్న వీధి దీపపు వెలుతురులో సమయం చూశాడు. పదకొండూ పదయింది. చేతిగడియారం తిరిగి బల్ల సొరుగులో పెట్టి సొరుగు మూసి మంచం దిగి నిలబడ్డాడు. నిద్ర ఎగిరిపోయింది. తెల్లవారే వరకు నిద్రపట్టదు.

గడిచిన వారం రోజులుగా సత్తిబాబుకునిద్ర పట్టటం లేదు. అతని పెళ్ళికి వారం రోజులు అడ్డుఉన్నాయి అనికాదుకాని తాంబూలాలు పుచ్చుకోక మునుపు చిట్టెమ్మతో తన పెళ్ళి త్వరగా జరిగితే బావుణ్ణు అనుకున్నవాడు తాంబూలాలు పుచ్చుకున్నాక ఈ పెళ్ళి జరగకపోతే బావుణ్ణు అనుకోవటం మొదలెట్టాడు. అతనికి చిట్టెమ్మ చాలా కాలంనుండి తెలుసు. చిట్టెమ్మ కోటిలింగం మరదలు. స్వయాన అతని భార్య చెల్లెలు. కోటిలింగంతో సత్తిబాబుకుఎటువంటి సమస్యలు ఎదురుకాలేదు. వాళ్ళ పరిచయం సామరస్య పూర్వకంగా నడుస్తుండేది. లోగడ తెలియని విషయం సత్తిబాబుకు ఈ మధ్యనే తెలిసింది. తెలిసిన తర్వాత అతను ఆలోచిస్తుంది ఒకటే, 'ఏం చేస్తే ఈ పెళ్ళి తప్పిపోతుంది?' అని. ఈ పెళ్ళి తప్పిపోవాలంటే తను ఈ ఊళ్ళోంచి పారిపోవాలి. ఉన్న కొద్దో గొప్పో పొలాల్ని వదులుకొని పారిపోయి మరెక్కడో బతకలేడు. అధవా పారిపోయినా కోటిలింగం తనెక్కడ ఉన్నా పట్టుకోగల సమర్థుడు. అతన్నించి తప్పించుకోవటం కష్టమయినపని. కోటిలింగానికి పట్టుబడితే తన బాధలు ఎలా ఉంటాయో ఊహించుకుంటేనే భయం వేస్తోంది. ఆ ఊళ్ళో అతనికి చాలామంది భయపడుతుంటారు.

సత్తిబాబు చెప్పులు తొడుక్కుని బయటకు వచ్చి తలుపువేసి గడిపెట్టి తాళం వేసి వీధిలోకి వచ్చాడు. అతను ఒంటరివాడు. దగ్గర బంధువులంటూ ఎవరూ లేరు. అతనికి ఇరవై ఎనిమిది సంవత్సరాల వయసుంటుంది. సన్నగా, పొడుగ్గా ఉంటాడు. స్నేహితులు కూడా అట్టేమంది లేరు. గాలి చల్లగా వీస్తోంటే కాలరు పైకి లాక్కుని చివరంటా కాలిన సిగరెట్‌తో మరో సిగరెట్ వెలిగించుకుని లుంగీ పైకి కట్టుకుని దొడ్డమ్మ ఇంటివైపు

నడవసాగాడు. దొడ్డమ్మ ఇల్లు అయిదారు వీధులవతల ఉంది. ఆమెతో మాట్లాడితేగాని తన మనసులోని భారం తగ్గేట్టులేదు. చిట్టెమ్మను చూపించింది, తనను ఒప్పించింది, సంబంధం కుదిర్చింది దొడ్డమ్మే!

దొడ్డమ్మ ఇంటి ముందాగి సిగరెట్ కింద పడేసి చెప్పుతో నొక్కి, లుంగీ కిందకు లాక్కుని తలుపు తట్టాడు. దొడ్డమ్మ ఆ సమయంలో మేలుకునే ఉంది. తలుపు తట్టిన చప్పుడు వినగానే మంచం దిగి, "ఎవరూ?" అడిగింది.

"నేను... నేను. సత్తిబాబును దొడ్డమ్మా".

ఆ సమయంలో సత్తిబాబు రావటం చిరాకుగానే అనిపించింది. ఆమెకు యాభయి అయిదు సంవత్సరాలుంటాయి. ఎర్రగా, పొట్టిగా, లావుగా ఉంటుంది. ఇంట్లో కూర్చునే వార్తలు సేకరిస్తుంటుంది. ఆ ఊళ్ళో ఆమెకు తెలియని విషయం అంటూ ఏమీ ఉండదు.

దొడ్డమ్మ తలుపు తీసి బయటకు వస్తూ "ఏవిట్రా ఈ వేళప్పుడు వచ్చావు?" అడిగింది విసుగ్గా.

"నీతో అర్జంటుగా ఒక మాట చెప్పి నీ సలహా తీసుకుందామని వచ్చాను."

"ఆ మాట ఏదో రేపు చెప్పొచ్చు కదా?"

"ఇప్పటికే ఆలస్యం అయిందనిపిస్తోంది."

"త్వరగా చెప్పు" అని అరుగుమీద చతికిలబడి "నీ పెళ్ళి రోజు దగ్గరవుతుంటే నీకు నిద్ర పట్టడం లేదనుకుంటాను..." అని నవ్వి, "పెళ్ళి శుభలేఖలు మన వాళ్ళందరికీ పంచిపెట్టవా?" అడిగింది.

"ఇంకా ఇవ్వలేదు" అని రెండు క్షణాలు మౌనంగా ఉండి చివరకు, "నాకో సహాయం చేసి పెట్టాలి" అన్నాడు చిన్నగా.

"ముందు కూర్చోరా."

ఆమె దగ్గరగా కూర్చుని రెండు చేతులు జోడించి "ఈ పెళ్ళి తప్పించు దొడ్డమ్మా.... ఈ పని చేసావంటే నీకు జీవితాంతం ఋణపడి ఉంటాను... ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు..."

"అలా నువ్వు అనుకుంటే సరా? ఈ సంగతి చెప్పు. పెళ్ళి ఎందుకు తప్పించమంటున్నావు?"

సత్తిబాబు వెంటనే జవాబు చెప్పలేదు. ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు.

దీర్ఘంగా నిట్టూర్చి, "చిట్టెమ్మంటే ఇష్టం లేదా?" అడిగింది.

"…. …."

"ఇష్టం లేని వాడివి తాంబూలాలు ఎందుకు పుచ్చుకున్నావు?"

"…. ….."

"ఈ ప్రశ్నకు జవాబు చెప్పు, చిట్టెమ్మంటే ఎందుకు ఇష్టంలేదు?"

"ఈ మధ్య చిట్టెమ్మ గురించి నేనో మాట విన్నాను."

"ఏమని?"

"చిట్టెమ్మ మంచిదికాదని…" ఆగి, దొడ్డమ్మ ముఖంలోకి చూశాడు. ఆమె ముఖం ప్రశాంతంగా ఉంది. 'నిజమేనా?' అడిగాడు.

"నీకీ సంగతి ఎవరు చెప్పారు?" నెమ్మదిగా అడిగింది. సత్తిబాబు అమాయకుడని ఆమెకు తెలుసు.

"ఒకతను చెప్పాడు". చెప్పినతని పేరు చెప్పటం సత్తిబాబుకు ఇష్టంలేదు.

"ఎవరో నాతో నయినా చెప్పకూడదా?" బుజ్జగింపుగా అడిగింది.

చెబితే ఏమి జరుగుతుందో సత్తిబాబు ఊహించగలడు. కోటిలింగానికి దగ్గర మనిషే అతను. "అతను ఎవరని అడగకు. నేను విన్నది నిజమా?" అడిగాడు.

"అబద్ధం" అని కొద్దిసేపు మౌనంగా ఉండి, చివరకు, "చూడు సత్తిబాబూ! ఎవడో ఏదో చెప్తే విని నమ్మేస్తే నేనేం చేయగలను? ఆ చెప్పిన వెధవ తాంబూలాలు పుచ్చుకోక ముందే చెప్పిచావచ్చు కదా! నీ పరిస్థితి నేను అర్థం చేసుకోవటం లేదని కాదు. దానికి అక్క తప్ప ఎవరూ లేరని నీకూ తెలుసు. నీకు మటుకు ఎవరున్నారు. చెప్పు. మీరిద్దరు ఒకటయితే బావుంటుందనుకుని నిన్ను కదిపాను. నువ్వూ ఇష్టపడ్డావు. అంతా సవ్యంగా కుదిరి వారం రోజుల్లో పెళ్లి అనగా ఎవరో ఏదో అన్నారని పెళ్ళి ఆపుచేయించమనటం బావుంటుందా చెప్పు! నిజం చెప్పాలంటే చిట్టెమ్మకు కూడా ఆ ఇంట్లో నుండి ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా బయటపడదామని ఉంది. ఆ పిల్లే నాతో ఈమాట స్వయంగా అంది. ఇంకో విషయం గుర్తుంచుకో. ఈ పెళ్ళి ఆగిపోయిందంటే కోటిలింగం ఊరుకోడు. ఈ పరిస్థితుల్లో నేనే విధంగా సహాయం చేయగలను? నువ్వే చెప్పు…" అంది.

పరిస్థితి అర్థం అయినట్లు తలూపి జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు సత్తిబాబు. ఈ పెళ్లి ఆగదు. జరుగుతుంది. తనను ఆదుకునేవాళ్లు ఈ ఊళ్ళో ఎవరూ లేరు. తను మోసపోయాడు. ముందు ముందు తమ సంసారం ఎలా ఉంటుందో ఆలోచించుకోటానికి

భయం వేస్తోంది. "ఇహ వెళ్ళి రా సత్తిబాబూ. తొందరపడి పిచ్చి పనులు ఏమీ చేయకు" అంది దొడ్డమ్మ.

"ఛ. ఛ. నేనెందుకు చేస్తాను? మనిద్దరి మధ్య జరిగిన ఈ సంభాషణ దయచేసి ఎవరికీ చెప్పకు."

"భలేవాడివి. నేనెందుకు చెప్తాను?" అంది దొడ్డమ్మ లేచి నుంచుంటూ.

సత్తిబాబు రోడ్డు మీదకు వస్తూ మొట్టమొదటిసారిగా అనుకున్నాడు, 'కోటిలింగాన్ని చంపెయ్యాలి' అని.

మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటలకల్లా సత్తిబాబు దొడ్డమ్మను కలుసుకున్న వార్త చిట్టెమ్మకు చేరింది. ఆమె ద్వారా కోటిలింగానికి తెలిసింది.

సత్తిబాబు పెళ్ళి ఆగిపోతుందేమోనని దొడ్డమ్మ భయపడింది. అతను ఊరొదిలి పారిపోతాడనుకుంది. అలా ఏం జరగలేదు. సత్తిబాబు పెళ్ళి చిట్టెమ్మతో నిరాడంబరంగా జరిగింది. పెళ్ళయిన వారానికి చిట్టెమ్మ రెండునెలల కడుపుతో కాపరానికి వచ్చింది. వాంతులవుతుంటే సత్తిబాబు అడిగాడు, "ఎవరు?" అని.

"నా ఖర్మ" అంది చిట్టెమ్మ.

కొద్దిసేపాగి మళ్ళీ అదే ప్రశ్న వేశాడు. "దిక్కులేని దానికి అందరూ మొగుళ్ళే" అని రెండు చేతులతో ముఖం కప్పుకుని ఏడవటం మొదలు పెట్టేసరికి అతనికి చిట్టెమ్మను ఓదార్చాలనిపించలేదు. తనమీదే తనకే అసహ్యం వేసింది. సగం తిన్న భోజనంలో చేయి కడుక్కుని లేచి బయటకు వస్తూ 'కోటిలింగాన్ని చంపెయ్యాలి' అని రెండోసారి అనుకున్నాడు. ఇది నిస్సందేహంగా వాడి పనే అయి ఉంటుంది అని కూడా అనుకుని ముందు సరాసరి దొడ్డమ్మ దగ్గరికి వెళ్దామనుకుని మధ్య దారిలో మనసు మార్చుకుని బస్టాండు చేరుకుని పట్నం వెళ్ళే బస్సు ఎక్కి కూర్చున్నాడు. పట్నం అక్కడికి పద్దెనిమిది మైళ్ల దూరంలో ఉంది. అతను పట్నం నుండి తిరిగి వచ్చేసరికి రాత్రి పది దాటింది. తలుపు తట్టాడు. చిట్టెమ్మ తలుపు తీసి, "ఎక్కడికి వెళ్ళావు?" అడిగింది.

"పట్నానికి."

"చెప్పి వెళ్ళొచ్చుగా. చాల సేపటివరకు రాకపోతే భయపడ్డాను."

"చెప్పకుండా వెళ్తే ఎవరి కొంపలు అంటుకోలేదు కదా!" కోపంగా అని, చొక్కా జేబులోంచి చిన్న పొట్లాం తీసి ఆమె చేతికి అందించి, "ఇందులో ఆరు మాత్రలున్నాయి. రోజుకు రెండు మాత్రల చొప్పున మూడు రోజులు వాడితే కడుపు పోతుంది. ఇవి

వాడటం ఇష్టం లేకపోతే చెప్పు. నిన్ను ఇప్పుడే తీసుకెళ్ళి మీవాళ్ళింట్లో వదలిపెట్టి వస్తాను" అన్నాడు.

చిట్టెమ్మ పొట్లాం విప్పి మాత్రల వంక చూసి కళ్ళెత్తి సత్తిబాబు ముఖంలోకి చూసింది. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి. రెండు మాత్రలు అందుకుని నోట్లో వేసుకుని మింగి "చాలా?" అడిగింది ఏడుస్తూ. ఆమె ఏడుస్తోంటే అతను చలించిపోయాడు. అప్పటివరకు పేరుకున్న కోపం కరగసాగింది. మెల్లగా చొక్కా విప్పి దండెం మీద వేశాడు. తువ్వాలు అందుకుంటుంటే. "నీ స్థానంలో మరొకరు ఉండుంటే నా గతి ఏమయి ఉండేదో నేనూహించగలను. నీ నీడలో సుఖంగా బతుకుదామని వచ్చాను..." అంది నెమ్మదిగా.

సత్తిబాబు ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు ఉబుకుతున్నాయి. పెదాలు వణుకుతున్నాయి. "నేను మంచిదాన్నని చెప్పను. చిన్నప్పటినుండి ఎన్నో కష్టాలు ఓర్చుకుని మా అక్కవాళ్ళ ఇంట్లోంచి బయటపడ్డాను. కొన్ని విషయాలు చెప్తే నువ్వు నమ్మవు. నీకు ఎలా చెప్పాలో కూడా నాకు అర్థం కావటంలేదు. నామీద అసహ్యంగా ఉంటే నన్ను ముట్టుకోకు. నాకు కొద్ది సమయం ఇవ్వు. నీ దగ్గిర ఉండనీయి. ఆ తర్వాత ఈ ఊరు వదిలి వెళ్ళిపోతాను. నీకు దండం పెడతాను. నన్ను మటుకు తీసుకెళ్ళి తిరిగి ఆ నరకకూపంలో పడేయకు." అని రెండు చేతులు జోడించింది. నాలుగురోజుల తర్వాత ఆమెకు గర్భస్రావమయింది.

రెండు నెలలు గడిచాక ఒక సాయంత్రం ఆరుగంటల సమయంలో కోటిలింగం సత్తిబాబు ఇంటికి వచ్చాడు. అప్పటికి సత్తిబాబు అతన్ని కలుసుకుని చాలా రోజులవుతోంది. కోటిలింగంతో ఎటువంటి సంబంధం పెట్టుకోకూడదనే ఉద్దేశంతో దూరంగా ఉండసాగాడు. తీరా అతనే సరాసరి తన ఇంటికి వచ్చేసరికి అయిష్టంగానే మంచంవేసి, దానిమీద కొత్తదుప్పటి వేసి కూర్చోమని చెప్పి "చిట్టెమ్మా! మీ బావ వచ్చాడే" కేకేశాడు. వాళ్ళ పెళ్ళయిన తర్వాత కోటిలింగం ఆ ఇంటికి రావటం అదే మొదటిసారి. అతను ఇంట్లోకి రావటం చిట్టెమ్మ పెరట్లోంచే చూసింది. బయటకు వచ్చి పలకరించాలనిపించలేదు. రాలేదు.

"నేనో పనిమీద వచ్చాను. అరగంటలో ఇక్కడకు కరణం వస్తున్నాడు. అతనికి మందు కొట్టించాలి. మా ఇంటికి చుట్టాలొచ్చారు. అక్కడ వీలుకాదు. కరణం ఇంట్లో కుదర్దు. అందుకనే ఇక్కడ కూర్చోబోతున్నాం. నువ్వేమీ అనుకోవద్దు. నీకు ఎటువంటి అభ్యంతరం లేదనే అనుకుంటున్నాను." అని సత్తిబాబు జవాబుకయి ఎదురుచూడకుండా "మన పంచాయితీ ఆఫీసు పక్కనే ఉంటాడు పెదకోటయ్య తెలుసుకదా, వాడింటికి

వెళ్ళు, నేను పంపించానంటే రెండు విస్కీ సీసాలిస్తాడు. తీసుకురా. వెళ్ళేప్పుడు సంచి తీసుకెళ్ళు. వచ్చేప్పుడు అయిదు రూపాయల కారా కట్టించుకుని అక్కడ్నించి సరాసరి సీతాలు ఇంటికి వెళ్ళి నేను ఇక్కడకు వెంటనే రమ్మన్నానని చెప్పు. సైకిలు తీసుకెళ్ళు. ఆలస్యం చేయకు" అని జేబులోంచి పది రూపాయల కాయితం తీశాడు.

సత్తిబాబు పదిరూపాయల కాయితం అందుకోలేదు. "పార్టీ బడిలోనో, సమితి ఆఫీసులోనో పెట్టుకోవచ్చుగా" అన్నాడు సత్తిబాబు ధైర్యం చేసి.

"అక్కడో మా ఇంట్లోనే వీలుంటే ఇక్కడికెందుకు వచ్చేవాడిని, చెప్పు?" కోపంగానే అన్నాడు.

"ఇటువంటివి చిట్టెమ్మకు నచ్చవు."

"చిట్టెమ్మకు నేను చెప్తానులే. చిట్టెమ్మను మా ఇంటికి గాని దొడ్డమ్మ ఇంటికి గాని పంపిస్తాను. ఇక్కడ ఉండదు. ముందీ డబ్బు తీసుకెళ్ళి త్వరగా వచ్చేయి." అన్నాడు కోటిలింగం.

అయిష్టంగానే పదిరూపాయల కాయితం అందుకుని జేబులో పెట్టుకుని ఇంట్లోకి వచ్చి సంచి అందుకుని చిట్టెమ్మకోసం చూశాడు సత్తిబాబు. చిట్టెమ్మ ఇంట్లో గాని, పెరట్లో గాని కనబడలేదు. ఎక్కడకు వెళ్ళి ఉంటుందా అనుకుంటూ బయటకు వచ్చాడు. కోటిలింగం ఏదో చెప్తున్నా వినిపించుకోకుండా సైకిలు అందుకుని ఎక్కి రోడ్డుమీదకొస్తూ మూడోసారి అనుకున్నాడు, 'కోటిలింగాన్ని చంపెయ్యాలి' అని.

పెదకోటయ్య దగ్గిర సీసాలు తీసుకుని సంచిలో పెట్టుకున్నాడు సత్తిబాబు. అటునుండి సీతాలు ఇంటికి వెళ్లాడు. తలుపు తట్టీ తట్టగానే "వస్తున్నా" అన్న మాట వెనక తలుపు తెరుచుకుంది. ఎదురుగా నిలబడి ఉన్న సత్తిబాబును చూసి అడ్డం తొలిగి, "లోపలికి రా" అంది. అంతకు మునుపు సీతాలును అతను చాలాసార్లు చూశాడు కాని అంత దగ్గరగా చూడటం మాట్లాడటం అదే మొదటిసారి. సీతాలుకు ఇరవై అయిదు సంతవ్సరాలుంటాయి. చామనచాయలో బొద్దుగా అందంగా ఉంటుంది. అయిదు సంవత్సరాల కిందట సీతాలు భర్త గ్రామ తగాదాల్లో చనిపోయాడు. ఆరేళ్ళ కొడుకున్నాడామెకు. సీతాలు భర్తను అప్పటి మునసబు చంపించాడని చెవులు కొరుక్కున్నారు. నిజమెంతో కోటిలింగానికి, కరణానికే తెలియాలి. మూడేళ్ళ కిందట జరిగిన పంచాయితీ ఎన్నికల సమయంలో మునసబు మామిడితోటలో శవమయ్యాడు. అతని చావులో కోటిలింగం, కరణంచేతులున్నాయని అనుకున్నారు. మునసబు చనిపోయాకే కోటిలింగం, కరణం స్నేహం పెరిగిన మాట అబద్ధం కాదు. సంవత్సరం

కిందటి వరకు సీతాలుకు 'నిప్పు' అని పేరుండేది. ఆనిప్పును కోటిలింగం తన వడిలోకి ఎలా లాక్కున్నాడో చాలామందికి అర్థంకాని విషయం. కోటిలింగం దగ్గర వశీకరణం ఉంగరం ఉంది. దాని మహత్యం వలన అతనికి ఆరేడుగురు స్త్రీలు లొంగిపోయారని సత్తిబాబు విన్నాడు. 'కోటిలింగం చనిపోయాక ఆ ఉంగరం కొట్టేయ్యాలి' అనుకుంటూ మంచం మీద కూర్చుంటుంటే, "చిట్టెమ్మ ఎలా ఉంది? పెళ్ళయిన తర్వాత చూడనేలేదు" అంది సీతాలు.

"బాగానే ఉంది" అని సీతాలు ముఖంలోకి చూశాడు. సీతాలు కన్నా చిట్టెమ్మే బావుంటుంది.

"మంచి నీళ్ళిచ్చేదా?" అని జడ ముందుకు తీసుకుంది.

"మీ అబ్బాయి ఎలా ఉన్నాడు?"

"బావున్నాడు. ఏవిటిలా వచ్చావు?"

"నన్ను కోటిలింగం పంపించాడు."

సీతాలు పెదవుల మీద చిరునవ్వు కదిలి పెద్దదయి బుగ్గల్లో సొట్టపోయింది. జడ మెడ చుట్టూ వేసుకుని, "ఏవిటంట విశేషం?" అడిగింది.

"నిన్ను వెంటనే మా ఇంటికి రమ్మనమని చెప్పాడు."

"ఎందుకో?"

"పార్టీ ఉంది."

"ఎవరెవరు వస్తున్నారేమిటి?"

"కోటిలింగం, కరణం."

"ఇంకా?"

"నువ్వు."

"మీ ఆవిడో?"

సత్తిబాబు మనస్సు చివుక్కుమంది. తల అడ్డంగా ఆడించాడు. సీతాలు అతని ముఖంలోకి పరీక్షగా చూసి ఏదో అడగబోయింది కాని అడగలేదు. సత్తిబాబు లేచి నిలబడ్డాడు. "నిమిషంలో టీ చేసిస్తాను. తాగేసి వెళ్ళు. ఇదే మొదటిసారి నువ్వు మా ఇంటికి రావటం" అంది.

"ఇంకోసారి వచ్చినప్పుడు తప్పకుండా టీ తాగుతాను."

"ఈసారి మీ భార్యాభర్తలు రండి. కోటిలింగం కోసం రాకు."

ఆమె మాటలోని అర్థం అతనికి వెంటనే తట్టలేదు. "త్వరగా వచ్చేసేయి" అని బయటకు వచ్చాడు. సీతాలు తన భార్య గురించి ఎందుకలా అన్నదో తెలుసుకోటానికి అక్కడే కొద్దిసేపు కూర్చుందామనుకున్నాడు కాని ఆలస్యం అయితే కోటిలింగానికి వెర్రెక్కుతుందని సైకిలెక్కి బజారులో కారా తీసుకొని ఇంటికి చేరుకునేసరికి కరణం ఇంట్లో మంచం మీద కూర్చుని ఉన్నాడు. నమస్కారం చేయాలా, వద్దా అనుకుంటూనే నమస్కారం చేశాడు. గోడవారగా ఉన్న మరో మంచం మీద కోటిలింగం పడుకుని ఉన్నాడు. తీసుకువచ్చినవి సంచి మంచం పక్కగా పెట్టి చిట్టెమ్మకోసం ఇంటి వెనకకు వచ్చాడు. చిట్టెమ్మ కనిపించలేదు. మధ్యగదిలోకి రాగానే, "చిట్టెమ్మను దొడ్డమ్మ దగ్గరకు పంపించాను. పంపిస్తానని చెప్పాను కదా... కరణం గారికి ఒక చిన్న పని చేసిపెట్టు. ఒక ముఖ్యమయిన ఫైలు రైసుమిల్లులో మర్చిపోయాడట. తీసుకొస్తావా? నువ్వు మిల్లుకెళ్ళి ఈ చీటి గుమాస్తాకు చూపించి కరణంగారు ఇచ్చారని చెప్పు. అతను ఫైలు నీకిస్తాడు. భద్రంగా పట్టుకుని రా. వెంటనే వచ్చేయి." అన్నాడు కోటిలింగం.

సత్తిబాబు విసుక్కుంటూ చీటి అందుకుని బయటకు వచ్చి చప్పుడయ్యేలా తలుపు కోపంగా మూసి బయటకు వచ్చి సైకిలు ఎక్కి, 'ఓరి కోటిలింగంగా నెలతిరగకుండా మూడో కంటికి తెలియకుండా నిన్ను గనక చంపకపోతే నా పేరు సత్తిబాబు కాదు' పదే పదే అనుకున్నాడు. ఊరు చివరికొచ్చాక సైకిలాపి చీటి జేబులోంచి తీసి మడతలు విప్పాడు. కరణం గుమాస్తాకు ఇంగ్లీషులో రాసిన చీటిలో ఇలా ఉంది. 'మూడు నాలుగు గంటల వరకు సత్తిబాబును మన మిల్లులో ఉండేట్లు చేయి. లేదా ఏదయినా పని పురమాయించి టౌనుకు పంపించు. ఏ ఫైలూ ఇవ్వనవసరం లేదు. ఎట్టి పరిస్థితులోనూ వీడిని పదకొండు గంటల ముందు వదలకు. సత్తిబాబుకు ఇంగ్లీషు రాదు. చీటిమడిచి తిరిగి జేబులో పెట్టుకుని సైకిలు తొక్కుతూ కోటిలింగాన్ని ఎలా చంపాలో ఆలోచిస్తున్న సమయానికి పెరటి తలుపు తీసుకుని చిట్టెమ్మ గదిలోకి తొంగిచూసింది. వీధితలుపు వేసి ఉంది. గది మధ్యలోకి రెండు మంచాలు పక్కపక్కగా జరిపి ఉన్నాయి. కరణానికీ, కోటిలింగానికీ మధ్య కూర్చున్న సీతాలు తలుపు తెరిచిన చప్పుడుకు తలెత్తి, "మీ ఆయన బయటకెళ్ళాడు, ఇప్పుడల్లా రాడు... రా." అంది.

తలుపు మూసి గడిపెట్టి మంచం దగ్గరకు రాగానే కరణం చిట్టెమ్మ చేయి అందుకుని ముందుకు లాక్కునేసరికి అతని వడిలో పడింది. అతనామె నడుం చుట్టూ చేతులు వేసి ఆమెను పైకి లేవనీయలేదు. తర్వాత ఆమె లేవటానికి ప్రయత్నం చేయలేదు. వాళ్లు నలుగురు కూర్చోవటం అది అయిదోసారి. ఆ ఇంట్లో అది మొదటిసారి.

రాత్రి పదకొండింటికి గాని సత్తిబాబు ఇంటికి చేరుకోలేదు. అరుగుమీద కూర్చొని చిట్టెమ్మ భర్త కోసం ఎదురుచూస్తూ అతను రాగానే గుండెమీంచి బరువు తొలిగి పోయినట్లనిపించింది. కోటిలింగం సత్తిబాబును ముట్టుపెడతాడేమో అనే భయం ఆమెకు లేకపోలేదు. సైకిలు ఇంట్లో పెడుతూ, "వాళ్లు వెళ్ళిపోయారా?" అడిగాడు.

"నేనొచ్చి అరగంట అయింది. అప్పటికే వెళ్ళిపోయారు" అబద్ధం ఆడింది.

"నాకు బాగా ఆకలి వేస్తోంది. అన్నం పెట్టు."

"పద" చిట్టెమ్మ లేచింది.

ఇద్దరూ భోజనాలకు కూర్చున్నాక, "సీతాలు ఇలా తయారయిందేమిటి?" అడిగాడు.

"ఒకరి సంగతి మనకెందుకు? దాని బాధలేవో అది పడుతోంది. ఇహనుండి మనింట్లో ఇటువంటి పార్టీలు జరగకుండా చూడు. ఈసారి అడిగితే మొహపడకుండా వీలు కాదనేయి. మా బావతో గట్టిగా ఉండు. మెత్తగా ఉంటే నెత్తికెక్కి కూర్చుంటాడు" అంది.

భోజనం చేసి బయటకు వచ్చి అరుగుమీద కూర్చుని, సిగరెట్ వెలిగించాడు. రెండో సిగరెట్ కాల్చిన తర్వాత లేచి ఇంట్లోకి వచ్చి తలుపు వేశాడు. చిట్టెమ్మ మంచం మీద నిద్రపోతోంది. లాంతరు వత్తి పెద్దది చేసి వంటగదిలోకి నడిచాడు. వంటగది మూలలో మూడుగ్లాసులూ, ఖాళీ అయిన సీసా కనిపించాయి. అలమారులో నిండు సీసా ఉంది. 'ఈ సీసా కోసం నాలుగైదు రోజుల్లో కోటిలింగం తప్పక వస్తాడు. ఇక్కడ కాకపోయినా మరెక్కడో, ఎవరితోనో పార్టీ పెట్టుకుంటాడు. ఈ సీసాలో విషం కలిపితేనో?' అనుకున్నాడు. ఆ రాత్రి చాలాసేపటికి వరకు దాని గురించే ఆలోచిస్తూ ఉండిపోయాడు.

మరుసటి రోజు టౌనుకెళ్లి విషం సంపాదించి చిట్టెమ్మ ఇంట్లో లేని సమయంలో అలమారులో ఉన్న విస్కీ సీసా మూత ఒడుపుగా తీసి అందులో విషాన్ని కలిపి తిరిగి ముందు ఎలా ఉందో అలా బిగించి అలమారులో పెట్టాడు.

వారం రోజుల తర్వాత సత్తిబాబు రాత్రి పదిన్నర సమయంలో పొలం నుండి ఇంటికి తిరిగి వస్తోంటే కోటిలింగానికి విపరీతంగా వాంతులవుతోంటే అరగంట కిందట ఆస్పత్రికి తీసుకెళ్ళారని తెలిసేసరికి ఎంతో సంతోషం వేసింది. ఎగిరి గంతెయ్యాలని కూడా అనిపించింది. నిగ్రహించుకుని ఇంటికి వెళ్ళకుండా సరాసరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్ళాడు. అప్పటికి కోటిలింగానికి ప్రాథమిక చికిత్స చేశారు కాని పరిస్థితి విషమిస్తోంటే పట్నంలోని జనరల్ ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలో సిబ్బంది

ఉన్నారు. అంబులెన్స్ వచ్చింది. కోటిలింగాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కించి, తోడుగా సత్తిబాబును వెళ్ళమని బలవంతంగా ఎక్కించి డాక్టరు, కరణం ముందు సీట్లలో కూర్చున్నారు. సహాయక సిబ్బందిని ఎవరినీ రానివ్వలేదు.

అంబులెన్స్ ఊరి పొలిమేరలు దాటాక కోటిలింగం పక్కగా వచ్చి నిలబడి ముందుకు వంగి అతని ముఖంలోకి చూశాడు సత్తిబాబు. కోటిలింగం ముఖంలో అప్పటికే మృత్యుకళ పాముకుంది. కళ్ళు లోతుకు పోతున్నాయి. ఒంటిమీద చేయివేశాడు. ఒళ్లు చల్లబడుతోంది. ఊపిరి భారంగా తీసుకుంటున్నాడు. కుడికాలు విపరీతంగా వణుకుతోంది. ప్రయోగించబడిన విష ప్రభావం గురించి పచారీ కొట్టువాడు చెప్తున్నప్పుడే తన వళ్ళు గగుర్పొడిచింది. కోటిలింగం మహా బతికితే మరో అరగంట. తనకు, ఊరికి మరీ ముఖ్యంగా చిట్టెమ్మకు, సీతాలు లాంటి వాళ్లకు పీడ విరగడయిపోతుంది. "కోటిలింగం" మెల్లగా పిలిచాడు. అతన్ని సత్తిబాబు పేరుపెట్టి పిలవటం అదే మొదటిసారి.

కోటిలింగం కనుబొమలు కదలాయి కాని పలకలేదు. కుడికాలి వణుకు తగ్గింది. సత్తిబాబు మళ్ళీ పిలిచాడు. కోటిలింగం కళ్ళు తెరిచాడు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ఏదో చెబుదామని నోరు తెరిచాడు. నోటి నుండి రక్తం చెంపమీదకు జారుతోంది.

"ఎలా ఉంది?"

కోటిలింగం చేయి పైకి లేచింది. చూపుడు వేలితో సత్తిబాబు గుండెమీద బలహీనంగా పొడుస్తూ, 'ఈ పని చేసింది నువ్వేకదూ?' అన్నట్టు జీవం పోతున్న కళ్ళతో చూశాడు. సత్తిబాబుకు పెద్దగా నవ్వుదామనిపిస్తోంది. కోటిలింగం బాధతో మెలికలు తిరిగి పోతూ తన కళ్ళముందు చావుకు దగ్గరవుతుంటే ఎంతో సంతోషంగా ఉంది. మీసాలు మెలితిప్పుకుంటూ 'అవును, నేనే' అందామనుకుని నోటి చివరంటా వచ్చింది కాని, అనలేదు. కోటిలింగం పెదాలు కదిపి ఏదో అనబోయాడు గాని గొంతు పెగిలి మాటలు బయటకు రాలేదు. కళ్ళు మూసుకున్నాడు.

రెండుక్షణాలు ఆగి సత్తిబాబు, కోటిలింగాన్ని పిలిచాడు. కోటిలింగం పలకలేదు. కొద్దిసేపు అతని ముఖంలోకి మౌనంగా చూసి గుండె వేగంగా కొట్టుకుంటుంటే కోటిలింగం కుడిచేతిని తన చేతుల్లోకి తీసుకొని వశీకరణం ఉంగరం పట్టుకుని వణుకుతున్న చేత్తో లాగాడు. చల్లటిగాలి కిటికీలోంచి విసురుగా వీస్తున్నా చెమట పడుతోంది. ఉంగరం కన్నా వేలికణుపు పెద్దగా ఉండటం వలన ఉంగరం రావటం లేదు. బిగుసుకుపోయింది. అంబులెన్స్ ఆస్పత్రి చేరేవరకు ఆ ఉంగరాన్ని తీయటానికి సత్తిబాబు ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు.

ఆస్పత్రిలో చేర్పించిన అరగంట తర్వాత స్పృహ రాకుండానే కోటిలింగం చనిపోయాడు. పోలీసులు రంగంలోకి దిగి శవపరీక్ష కోసం పట్టుబట్టేసరికి కరణం తన పలుకుబడి ఉపయోగించి ఏం చేయాల్సిన చోట అది చేసి శవపరీక్ష జరగకుండా చూశాడు. అయితే శవాన్ని అప్పగించే ముందు రెండు షరతులు పెట్టారు. మొదటిది, కోటిలింగం చావులో తమకు ఎవరిమీదా అనుమానం లేదని అతని భార్యా, మరో ఇద్దరు దగ్గిరవాళ్ళు రాసివ్వాలి, రెండోది, శవాన్ని దహనం చేయకూడదు. పోలీసుల సమక్షంలో పూడ్చిపెట్టాలి.

ఈ షరతులకు వప్పుకుని అన్ని తతంగాలు పూర్తి చేసుకుని, ఊరు తీసుకువచ్చి మరుసటి రోజు చీకటి పడకముందే కోటిలింగం శవాన్ని స్మశానంలో పూడ్చిపెట్టారు. శవాన్ని పూడ్చి పెట్టిన తర్వాత కోటిలింగం ఇంటికి వెళ్లి అతని భార్యను పలకరించి తనింటికి వచ్చి స్నానం చేసి పడుకున్నాడు. వెంటనే నిద్రపట్టలేదు. అతని ఆలోచనలన్నీ కోటిలింగం మీద కేంద్రీకృతమయి ఉన్నాయి. మరీ ముఖ్యంగా నీలిరాయి ఉంగరం మీంచి ఆలోచన జారటం లేదు. అది బంగారపు ఉంగరం కాదు. వశీకరణం ఉన్న ఇత్తడి ఉంగరం. ఎలాగయినా దాన్ని చేజిక్కించుకోవాలి. రాత్రి రెండుగంటల తర్వాత ఇంట్లో ఉండలేకపోయాడు సత్తిబాబు. లేచి చొక్కా తొడుక్కుని వంటగదిలోకి వచ్చి అలమారులో చూశాడు. విస్కీ సీసాలేదు. 'సీసా ఎవరు తీసుకువెళ్ళారో? చిట్టెమ్మ వాళ్ళ అక్క వాళ్ళింటి నుండి వచ్చాక అడిగి తెలుసుకోవచ్చులే' అనుకుని పెరట్లో ఉన్న పార, పలుగు తీసుకుని గోనె సంచిలో వేసుకుని పెరటి తలుపు దగ్గరగా వేసి ఇంటి వెనక నుండి స్మశానం వైపు నడవసాగాడు. అక్కడికి స్మశానం అడ్డదోవలో మూడు ఫర్లాంగుల దూరంలో ఉంది.

మొండి ధైర్యంతో సత్తిబాబు స్మశానానికి చేరుకోగలిగాడు గాని కోటిలింగం శవాన్ని పాతి పెట్టిన చోట తవ్వటానికి భయం వేసింది. నిశ్శబ్దపు చీకటిలో పావుగంటపాటు తటపటాయించాడు. శవానికి ఉన్న ఉంగరం తనిప్పుడు తీసుకోకపోతే ఎప్పటికీ తీసుకోలేనని అనిపించేసరికి భయాన్ని పక్కనపెట్టి తెచ్చుకున్న పనిముట్లతో కోటిలింగం శవాన్ని పాతిపెట్టిన చోట తవ్వటం ప్రారంభించాడు.

అంతకుముందు తవ్వి తీసిందే కాబట్టి ముప్పావుగంటలో నాలుగు అడుగుల లోతు మట్టిని సత్తిబాబు తేలికగా తీయగలిగాడు.అయితే సమాధిలో కర్రలు, పూలు తప్ప కోటిలింగం శవం లేదు.

◆ విజయ, మాసపత్రిక, అక్టోబరు 1982